క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌ ఎన్నికల ప్రచార కన్వీనర్‌గా 'బొలిశెట్టి'



భద్రాచలం: భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ ప్రచార కన్వీనర్‌గా బొలిశెట్టి రంగారావును ఎన్నికల ఇన్‌చార్జ్‌ తాతా మధు నియమించారు. ఈ మేరకు ఆయన నియామక పత్రం నియోజకవర్గ అభ్యర్థి వెంకట్రావ్‌ సమక్షంలో రంగారావుకు అందజేశారు. రానున్న ఎన్నికల్లో వెంకట్రావ్‌ గెలుపునకు పాటుపడాలని కోరారు.

15న కంటి వైద్యశిబిరం

భద్రాచలంఅర్బన్‌: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం భద్రాచలం శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు జి.భూషణ్‌ రావు తెలిపారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్థానిక కూనవరం రోడ్‌ నందులో పెన్షనర్స్‌ భవనం నందు నిర్వహించే శిబిరానికి హాజరయ్యే వారు తమ వెంట హెల్త్‌ కార్డు (ఈహెచ్‌ఎస్‌) తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జి.వెంకన్న, ఎస్‌.హనుమంతరావు, ఎంఏ ఖాదర్‌ పాల్గొన్నారు.

ఆయుర్వేద దినోత్సవం

అశ్వాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వైద్యాధికారి జీ.అరుణ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆయుర్వేద దైవం, సృష్టికర్త ఐన ధన్వంతరి జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. వైద్యులు గోపిలాల్‌, పారామెడికల్‌ సిబ్బంది జీ.రాధిక, సరస్వతి పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

మణుగూరు రూరల్‌ : మణుగూరు పట్టణంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని శ్రీవిద్య డిగ్రీ కళాశాల, హెచ్‌డీఎఫ్‌సీ మణుగూరు బ్రాంచ్‌, రెడ్‌ క్రాస్‌ సొసైటీ భద్రాచలం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురు రక్తదానం చేయగా వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్య డిగ్రీ కళాశాల చైర్మన్‌ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, బ్రాంచ్‌ మేనేజర్‌ యుగేందర్‌, రెడ్‌క్రాస్‌ సొసైటీ సభ్యులు రాజారెడ్డి, రాజు కంప్యూటర్స్‌ నిర్వాహకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా

చండ్రుగొండ: తనని మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని' ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలో మద్దుకూరులోని వెంకటేశ్వరస్వామి, సమ్మక్క సారాలమ్మ ఆలయాల్లో శుక్రవారం పూజలు చేసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజల నుండి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు దార వెంకటేశ్వరరావు, ఎస్డీ రసూల్‌, సూరా వెంకటేశ్వర్లు, భూపతి శ్రీనివాసరావు, వైస్‌ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, నల్లమోతు వెంకటనారాయణ, గాదె లింగయ్య, పవన్‌బాబు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

చండ్రుగొండ : మండలంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. కొత్తగూడెం మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మెన్‌ సంకా రామారావు, మైనార్టీ నాయకులు ఎండీ.యాకూబ్‌ అలీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్‌ నాయకుడు కోనేరు సత్యనారాయణ (చిన్ని) సమక్షంలో పార్టీలో చేరారు. అదే విధంగా కిషన్‌గౌడ్‌, కుంచపు కన్నయ్య, బీజేపీకి చెందిన రాంబాబు, లక్ష్మి, యూత్‌ కాంగ్రెస్‌కు చెందిన వహాబ్‌ఖోటు, సయ్యద్‌ బషీర్‌, రాహుల్‌, మధు చేరారు. జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, దార వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చర్ల రూరల్‌: కాంగ్రెస్‌ పార్టీ మండల యూత్‌ అధ్యక్షుడు అలవాల మహేష్‌ నాయుడు, నాయకులు ఇందల రమేష్‌, బుచ్చిబాబు, చల్లకోటి వాసు మంత్రి కేటీఆర్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఏపీ తరహాలో పొగాకు రైతులకు రుణాలివ్వాలి

అశ్వారావుపేటరూరల్‌: స్థానిక యూనియన్‌ బ్యాంకు వార్షికోత్సవ వేడుకల్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంక్‌ సీనియర్‌ మేనేజర్‌ ప్రసాద్‌ కేక్‌ కట్‌ చేసి ఖాతాదారులు, ఉద్యోగులు, సిబ్బందికి పంచారు. ఈ సందర్భంగా ఏపీలో తరహాలోల పొగాకు రైతులకు రూ.7లక్షలు రుణం ఇప్పించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన రుణ పరిమితిను పెంచేలా కృషి చేస్తానని రైతులకు చెప్పారు. బ్యాంకు మేనేజర్‌ ప్రవీణ్‌, రైతులు, ఉద్యోగులు ఉన్నారు.

మాటలుగానే హామీలు..

గెలిచాక నాయకులు మొహం చాటేస్తున్నారని ఆదివాసీల ఆవేదన

- నరిహద్దు గ్రామాల్లో రోడ్లు, విద్య, వైద్యం కరువు
- ఏజెన్సీకి అందని ద్రాక్షలా ఉన్నత చదువులు
- ఎన్నికలప్పుడే తెరపైకి వద్దిపేట చెక్‌డ్యాం..
- స్పష్టమైన హామీ ఇచ్చే వారికే మద్దతు అంటున్న ప్రజలు



అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఎర్రంపాడు గ్రామం



రహదారి సౌకర్యం లేకపోవడంతో గర్భిణిని జడ్డీ కట్టి తీసుకొస్తున్న ఆదివాసీలు(ఫైల్‌)

చర్ల: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్లను తమ వైపునకు మళ్లించుకునేందుకు రాజకీయ నాయకులు హామీలను గుప్పిస్తున్నారు. ప్రతీ ఎన్నికల సందర్భంలోనూ రావడం హామీలను ఇస్తున్నారే తప్పా వాటి అమలుకు మాత్రం ఏ విధమైన చర్యలు చేపట్టడం లేదంటూ పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలప్పుడు తప్పా మిగిలిన సందర్భాల్లో రాజకీయ నాయకులు వారి గ్రామాల వైపు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదంటూ వాపోతున్నారు. తమను కేవలం ఓటు బ్యాంకు కేసమే ఈ పాలకులు, రాజకీయ నాయకులు వాడుకుంటున్నారే తప్పా వారి సమస్యలను పట్టించుకోవడం లేదంటున్నారు. ఆయా సమస్యలపై ఓట్ల కోసం వచ్చే నేతలను నిలదీయడంతో పాటు స్పష్టమైన హామీ ఇస్తేనే వారికి ఓటేస్తామంటూ పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

కాలిబాటలు.. అత్యవసరమైతే జడ్డీలే గతి..

మండలంలోని పలు గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేదు. దీంతో ఏదైనా అత్యవసరమైతే ప్రాణాలను పోగొట్టుకోవాల్సిన దుస్థితి ఎదురవుతోంది. అంబులెన్సు రాక ప్రయివేటు వాహనాలు పోక ఆపదలో ఉన్న వారిని ఆస్పత్రికి చేర్చాలంటే జడ్డీ కట్టాల్సిన దుస్థితి ఏర్పడుతోందని పలు గ్రామాలకు చెందిన ఆదివాసీలు వాపోతున్నారు. సరిహద్దు ప్రాంతంలోని ఆయా గ్రామాలు ఏర్పడి నాలుగైదు దశాబ్దాలు కావస్తున్నప్పటికీ ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రహదార్లు నిర్మించాలని ఆదివాసీలు కోరుతున్నారు.

ఎన్నికలప్పుడే గుర్తొస్తున్న వద్దిపేట చెక్‌డ్యాం.

మండలంలోని 18 గిరిజన గ్రామాల్లోని 7 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు అవసరమైన వద్దిపేట చెక్‌డ్యాం గురించి మండలంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజన, దళిత, బలహీన వర్గాల రైతులు దాదాపు రెండు దశాబ్దాల కాలంగా ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. ప్రతీ ఎన్నికల సందర్భంలోనూ రాజకీయ నాయకులు మేము అధికారంలోకి వచ్చిన తరువాత చేస్తామంటూ మేము అధికారంలోకి వచ్చిన తరువాత చేస్తామంటూ హామీలిచ్చి గెలిచిన మోహం చూపించట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలగానే విద్యాసంస్థలు..

విద్యార్థులకు ఉన్నత చదువులు అందని ద్రాక్షగానే మారుతున్నాయి. చర్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, బీఈడీ, ఐటీఐ, గిరిజన యూనివర్సిటీలు అవసరమున్నప్పటికీ వాటిని ఏర్పాటు చేసేందుకు ఈ ప్రభుత్వమూ ముందుకు రావడం లేదు. చర్లకు మంజూరైన గిరిజన యూనివర్సిటీని గుట్టుచప్పుడు కాకుండా ములుగు జిల్లాకు తరలించిపాలకులు తీవ్ర అన్యాయం చేశారని విద్యావేత్తలు, విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఐటీఐ, డిగ్రీ, పీజీ కళాశాలలు అవసరం ఎంతగానో ఉన్నప్పటికీ వాటిని ఏర్పాటు చేసేందుక పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు ఉన్నత చదువులు అందని ద్రాక్షగానే మిగిలాయి.

ఫైర్‌స్టేషన్‌పై పట్టింపేది.?

ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలంటూ ఈ ప్రాంత ప్రజలు ఏళ్ల తరబడిగా డిమాండ్‌ చేస్తూ వస్తున్నారు. ఏటా వేసవి కాలంలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలతో లక్షలాది రూపాయల ఆస్తినష్టం జరుగుతున్నప్పటికీ ఫైర్‌ స్టేషన్‌ ఏర్పాటుపై ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదు. పక్కనే ఉన్న పినపాక నియోజకవర్గంలోని మణుగూరుకు ఫైర్‌ స్టేషన్‌ను మంజూరు చేసిన ప్రభుత్వం చర్ల ప్రాంతంపై ఎందుకు వివక్ష చూపిందంటూ ఈ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

స్పష్టమైన హామీ ఇచ్చే వారికే ఓటు..



మా తాత ముత్తాతల కాలం నాటి నుంచే చర్లలోనే జీవిస్తున్నాం. వలస వాదులంటూ మా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించడం లేదు. రహదారి, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు లేవు. రోడ్లు లేక అత్యవసరమైతే దారిలోనే ప్రాణాలను పోతున్నాయి. ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వడం నిలిపివేయడంతో ఉన్నత చదువులు చదివినప్పటికీ భవిష్యత్‌ ప్రశ్నార్థకంగానే ఉంటోంది. మా సమస్యలపై స్పష్టమైన హామీ ఇచ్చే వారికే ఈ ఎన్నికల్లో ఓటు వేస్తాం.

– మడకం చందు, గోండు యువసేన అధ్యక్షుడు, చర్ల

కళాశాలలు ఏర్పాటుచేయాలి



చర్ల ప్రాంత విద్యార్థులకు ఉన్నత చదువులు చదువుకునేందుకు ప్రభుత్వాలు చొరవ తీసుకోవడం లేదు డిగ్రీ, పీజీ, ఐటీఐ కళాశాలల అవసరం ఎంతగానో ఉంది. పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు ఇంటర్‌తోనే వారి చదువులు ఆపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతీ ఎన్నికల సందర్భంలోనూ నాయకులు హామీలు ఇస్తున్నారే తప్ప వాటిని అమలు చేయడం లేదు. దీంతో విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారు.

– మామిడి రాజు, తేగడ

'భాగస్వామ్య గ్రామీణ అంచనా' కార్యక్రమం



గ్రామీణ అంచనా నమూనా ప్రదర్శన

అశ్వారావుపేటరూరల్‌: స్థానిక ప్రొఫెసర్‌ జయశంకర్‌ సార్‌ వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన మండలంలోని నారాయణపురం గ్రామంలో శుక్రవారం 'భాగస్వాయ్య గ్రామీణ అంచనా' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక రైతువేదిక ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఉన్న వనరులు, పంట పొలాలు, పంట సరళి, సామాజిక సంస్థలు, కమ్యూనిటీ అవసరాల గురించి ఆయా నమూనాల ద్వారా స్థానిక రైతులు, విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు టి.శ్రావణ్‌కుమార్‌, శిరీషా, గోపాలకృష్ణమూర్తి, పావని, ఆర్‌.రమేష్‌, ఐ.కృష్ణతేజ, జంబమ్మ, ప్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కరకగూడెం: పార్టీలోకి ఆహ్వానిస్తున్న పొంగులేటి



ములకలపల్లి: కండువా కప్పుతున్న ఆదినారాయణ

కరకగూడెం: రానున్నది కాంగ్రెస్‌ రాజ్యమేనని అందుకు ప్రతీ ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కాంగ్రెస్‌ పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్‌ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మం మాజీ ఎంపీ, సమక్షంలో ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రేగళ్ల సర్పంచ్‌ కుంజా వసంతరావు, ఉప సర్పంచ్‌ బాడిశ లక్ష్మీనారాయణ, కరకగూడెం ఉపసర్పంచ్‌ రావుల రవి ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, పోలెబోయిన తిరుపతయ్య, ఎర్ర సురేష్‌ పాల్గొన్నారు.

ములకలపల్లి: ములకలపల్లి మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు శుక్రవారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్‌ అశ్వారావుపేట అభ్యర్థి జారె ఆదినారాయణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సర్పంచ్‌లు కారం సుధీర్‌, సున్నం సుధాకర్‌, కీసరి శ్రీను, సొసైటీ డైరెక్టర్‌ అనుమల సత్యనారాయణ, ఎంపీటీసీలు తాటి తులసి, సున్నం సునిత, నాయకులు బాల అప్పారావు, సురభి రాజేశ్‌, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, ఉపసర్పంచ్‌ శనగపాటి అంజి, నాయకులు, పాల్గొన్నారు.

మణుగూరు టౌన్‌: ఓసీ–2 ట్రాక్స్‌ క్లీనింగ్‌ వర్కర్స్‌ 40 కుటుంబాలు కాంగ్రెస్‌ పార్టీలో చేరగా పాయం వెంకటేశ్వర్లు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టబోయే ఆరు గ్యారంటీలపై ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌లోకి 'రావులపల్లి'

భద్రాచలం: భద్రాచలం సీపీఐ సీనియర్‌ నాయకుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రాంప్రసాద్‌ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ మేరకు భద్రాచలం బీఆర్‌ఎస్‌ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్‌, ఎమ్మెల్సీ తాతా మధు శుక్రవారం రాంప్రసాద్‌ ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. భద్రాచలం సీపీఐలో రాంప్రసాద్‌ కీలకంగా వ్యవహరిస్తుండగా, సమస్యలపై పోరాడుతూనే పార్టీలో కీలక పదవులు నిర్వర్తించారు. ఈ మేరకు పట్టణ కార్యదర్శి అకోజు సునీల్‌ సైతం చేరనున్నట్లు సమాచారం

మారిన సమీకరణలతోనే..

భద్రాచలం నియోజకవర్గ సీపీఐలో రావులపల్లి రాంప్రసాద్‌ కీలకంగా వ్యవహరించగా, ఆయన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ మేనబావ అవుతారు. ఇటీవల కాంగ్రెస్‌, సీపీఐ నడుమ పొత్తు కుదరవడంతో భద్రాచలంలో కాంగ్రెస్‌ తరఫున రాంప్రసాద్‌ ప్రచారం చేయాల్సి ఉంది. ఈ నేపథ్యాన బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ తాతా మధు కలిసి పార్టీలోకి ఆహ్వానించడంతో తర్జనభర్జనల నడుమ బీఆర్‌ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

మణుగూరు రూరల్‌: అండర్‌ ఏజ్‌ స్కూల్‌ గేమ్స్‌ ఫెడరైజేషన్‌ ఇండియా వారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర 67వ నేషనల్‌ స్కూల్‌ గేమ్స్‌ 2023–24లో మణుగూరు జెడ్పీ కో ఎడ్యుకేషన్‌ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. క్రికెట్‌ అండర్‌–17 బాలికల విభాగంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రికెట్‌ సీనియర్‌ గర్ల్స్‌ కెప్టెన్‌ పోలెబోయిన వైష్ణవి రత్న, కబడ్డీ అండర్‌–14 బాలుర విభాగంలో పితాని దుర్గా భగవాన్‌ సత్తా చాటారు. వీరిని హెచ్‌ఎం నాగశ్రీ వ్యాయామ ఉపాధ్యాయులు కోడి ఆదినారాయణ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే కరాటే పోటీల్లో శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన పసుపులేటి నిక్షిత ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

చెస్‌ పోటీలో ప్రతిభ



కె.భవ్యశ్రీలక్ష్మి

అశ్వారావుపేటరూరల్‌: జిల్లా స్థాయి చెస్‌ పోటీలో అశ్వారావుపేటకు చెందిన విద్యార్థిని కేశిబోయిన భవ్యశ్రీలక్ష్మి ప్రతిభ కనబరించింది. ఖమ్మం జిల్లా చెస్‌ అసోసియేషన్‌ వీ కింగ్స్‌ చెస్‌ అకాడమీ టోర్నమెంట్‌ డైరెక్టర్‌ కిరణ్‌ కుమార్‌ ఆధ్వర్యంలో సత్తుపల్లిలో అండర్‌ 13 విభాగంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఓపెన్‌ చెస్‌ పోటీల్లో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని లాల్‌ బహదూర్‌ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్‌ పోటీలకు ఎంపికైంది.

హోమియోపతి వైద్యశిబిరం

దుమ్ముగూడెం : మండలంలోని చింతగుప్ప గ్రామంలో పర్ణశాల హోమియోపతి డాక్టర్‌ రాజేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి మందులను అందజేశారు.

దీపావళి సందడి షురూ..

దీపావళి పండుగ సందడి మొదలైంది. అలాంటి పండుగలో ప్రత్యేక స్థానం పొందిన దీపపు కుందుల వ్యాపారం మణుగూరులో జోరుగా సాగుతోంది. కుందులతో పాటు రంగురంగుల దేవుని ప్రతిమలు, పలు అలంకరణ వస్తువులను అమ్మకానికి సదరు వ్యాపారులు తోపుడు బండ్లపై ఉంచారు. – మణుగూరు రూరల్‌





విక్రయానికి సిద్ధంగా ఉన్న దీపపు కుందులు

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న విప్‌ కాంతారావు

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్‌ పార్టీయే అధికారం చేపడుతుందని ప్రభుత్వ విప్‌ రేగా కాంతారావు ధీమా వ్యక్తం చేశారు. లక్ష్మీపురంలో ఈ నెల 13న జరగనున్న సీఎం కేసీఆర్‌ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సీఎం కేసీఆర్‌ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్ష అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకర్గాల్లో గులాబీ జెండా రెపరెపలాడుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీష్‌, కామిరెడ్డి రామకొండారెడ్డి, పోతిరెడ్డి గోవిందరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లో చేరిక..

అశ్వాపురం: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో ఉపసర్పంచ్‌ బొల్లినేని గణేష్‌, కాంగ్రెస్‌ పార్టీ యూత్‌ నాయకుడు గజ్జి మనోజ్‌, రాసాల కొమరయ్య, సీపీఐ పార్టీ సీనియర్‌ నాయకుడు పోతురాజు ముత్తయ్యతో పాటు పలువురు రేగా కాంతారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రేగా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, వైస్‌ ఎంపీపీ వీరభద్రం, బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు కోడి అమరేందర్‌, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు గజ్జల లక్ష్మారెడ్డి, జాలె రామకృష్ణారెడ్డి, ఈదర సత్యనారాయణ, గద్దల రామకృష్ణ పాల్గొన్నారు.

పోలింగ్‌ కేంద్రాల పరిశీలన



పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్‌ గణేష్‌

దుమ్ముగూడెం : మండలంలోని పోలింగ్‌ కేంద్రాలను భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల జనరల్‌ అబ్జర్వర్‌ గణేష్‌ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని తూరుబాక, నర్సాపురం, దుమ్ముగూడెం, ప్రగళ్లపల్లి పోలింగ్‌ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ చంద్రశేఖర్‌, ఎంపీడీఓ ముత్యాలరావు, ఆర్‌ఐ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శులు సందీప్‌, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

రిటర్నింగ్‌ కార్యాలయం సందర్శన



హరికిషోర్‌కు మొక్క అందజేస్తున్న ప్రతీక్‌ జైన్‌

మణుగూరు రూరల్‌ : ఎన్నికల నేపథ్యంలో మణుగూరు మండలం తహసీల్దార్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్‌ కార్యాలయాన్ని ఎన్నికల పరిశీలన అధికారి ఎస్‌.హరికిషోర్‌ శుక్రవారం సందర్శించారు. తొలుత కార్యాలయానికి వచ్చిన ఎన్నికల పరిశీలన అధికారికి పినపాక ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి ప్రతీక్‌ జైన్‌ మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను సంబంధిత వివరాలను ఎన్నికల రిటర్నింగ్‌ అధికారిని అడిగి తెలుసుకున్నారు.

విస్తృతంగా ప్రచారం..



దుమ్ముగూడెం : మేనిఫెస్టో వివరిస్తున్న ఎమ్మెల్యే వీరయ్య సతీమణి పద్మ



మణుగూరు రూరల్‌: బీఆర్‌ఎస్‌ నాయకుల ప్రచారం



భద్రాచలంఅర్బన్‌: సీపీఎం నాయకుల ప్రచారం

దుమ్ముగూడెం : మండలంలోని దుమ్ముగూడెం, ములకపాడు గ్రామాలలో శుక్రవారం భద్రాచలం ఎమెల్యే పొదెం వీరయ్య సతీమణి పొదెం పద్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు లంక అబ్బులు, నాయకులు సీతారామారావు, లక్ష్మణ్‌, అప్పల రెడ్డి, సంగీతరావు, లంక శివ, సందీప్‌ రెడ్డి, మహిళా కాంగ్రెస్‌ జిల్లా కార్యదర్శి పండాల సరిత, మండల కాంగ్రెస్‌ మహిళా అధ్యక్షురాలు మద్ది కుమారి, వసీమ, హసీనా, రాంబాయి, వర లక్ష్మి, అలివేలు, సరూప పాల్గొన్నారు.

మణుగూరు టౌన్‌: పినపాక కాంగ్రెస్‌ అభ్యర్థి పాయం గెలుపునకు కృషి చేయాలని కోరుతూ అన్ని వార్డుల్లో కాంగ్రెస్‌ నాయకులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు గాండ్ల సురేశ్‌, బత్తుల నవీన్‌, పెనుగొండ సాంబశివరావు, కుర్రం రవి, తమ్మిశెట్టి సాంబ, వాగబోయిన శ్రీను, ఆర్‌కే రాము, జగన్‌ పాల్గొన్నారు.

సరిహద్దు గ్రామాల్లో ..

చర్ల: చర్ల మండలంలో ఛత్తీస్‌గఢ్‌కు సరిహద్దున ఉన్న గ్రామాల్లో కాంగ్రెస్‌ నాయకులు ప్రచారం చేశారు. కాంగ్రెస్‌ మండల అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, డీసీఎంఎస్‌ డైరెక్టర్‌ పరుచూరి రవికుమార్‌, నాయకులు చీమకుర్తి వీరభద్రం, చీమలమర్రి మురళీకృష్ణ, కారంపూడి సాల్మన్‌రాజు, తోటమల్ల వరప్రసాద్‌, శిరిపురపు శివకుమార్‌, బండి వేణు, కె.విజయకుమార్‌ నాయుడు, పెద్దిరాజు, మైపా చిరంజీవి పాల్గొన్నారు.

రేగాని గెలిపించాలని బీఆర్‌ఎస్‌ నాయకులు..

మణుగూరు రూరల్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ పినపాక అసెంబ్లీ అభ్యర్థి రేగా కాంతారావును గెలిపించాలని బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు మండల పరిధిలోని గ్రామాల్లో తిరుగుతూ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

భద్రాచలంఅర్బన్‌: భద్రాచలం పట్టణంలో సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్య ఎన్నికల ప్రచారాన్ని ఆయన నిర్వహించారు. శుక్రవారం కాలేజీ గ్రౌండ్‌లో వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్‌, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, రమేష్‌, కార్యదర్శి వర్గ సభ్యులు భీమవరపు వెంకటరెడ్డి, బండారు శరత్‌ బాబు, ఎర్రం శెట్టి వెంకటరామారావు, పారేల్లి సంతోష్‌ కుమార్‌ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

పినపాకలో 36, భద్రాచలంలో 26, అశ్వారావుపేటలో 35 దాఖలు

ఈ నెల 3 నుంచి ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.



మణుగూరు రూరల్‌: నామినేషన్‌ సమర్పిస్తున్న అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి బాలరాజు



భద్రాచలం: నామినేషన్‌ అందజేస్తున్న పూనెం ప్రదీప్‌ కుమార్‌

భద్రాచలం: భద్రాచలం నుంచి పోటీ చేసేందుకు 18 మంది అభ్యర్థులు 26 నామినేషన్లను దాఖలు చేశారు. శుక్రవారం నలుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లను రిటర్నింగ్‌ అధికారి మంగీలాల్‌కు అందజేశారు. చింతా అరుణ గోండ్వానా దండకారుణ్య పార్టీ, చీమల వీరభద్రం ఆబాద్‌ పార్టీ, బొర్రా రాజు బహుజన ముక్తి పార్టీ, పూనెం ప్రదీప్‌ కుమార్‌ భారత చైతన్య యువజన పార్టీ, ఇర్పా రవికుమార్‌ బీఎస్పీ పార్టీ తరుపున రెండవ నామినేషన్‌ సెట్‌ను ఇచ్చారు.

అశ్వారావుపేట: అశ్వారావుపేట(ఎస్టీ) అసెంబ్లీ నియోజకవర్గానికి మొత్తం 23 మంది అభ్యర్థులు 35 సెట్ల నామినేషన్లను దాఖలు చేసినట్లు రిటర్నింగ్‌ అధికారి పర్సా రాంబాబు శుక్రవారం తెలిపారు. నామినేషన్‌ దాఖలు చేసిన వారిలో మెచ్చా నాగేశ్వరరావు (బీఆర్‌ఎస్‌), జారే ఆదినారాయణ (కాంగ్రెస్‌), పిట్టల అర్జునరావు(సీపీఎం), మడకం ప్రసాద్‌ (బీఎస్పీ), గొగ్గల ఆదినారాయణ (సీపీఎం) తదితరులు ఉన్నారన్నారు.

మణుగూరు రూరల్‌: పినపాక నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి శుక్రవారం 25 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా మొత్తం 36 సెట్లు దాఖలు అయినట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ, పినపాక ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి ప్రతీక్‌ జైన్‌ తెలిపారు. నామినేషన్లను సమర్పించిన వారిలో రేగా కాంతారావు(బీఆర్‌ఎస్‌), పాయం వెంకటేశ్వర్లు(కాంగ్రెస్‌), పొడియం బాలరాజు(బీజేపీ), వజ్జా జ్యోతి బసు (గొండ్వానా దండకారుణ్య పార్టీ), వజ్జా శ్యాములు (బీఎస్పీ), పలువురు స్వతంత్ర అభ్యర్థులు, తదితరులు ఉన్నారు.